క్లుప్తంగా

విజేతకు సత్కారం

కర్నూలు (టౌన్): గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన 35వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు క్రీడాకారుడు హేమంత్ కాంస్య పతకం సాధించాడు. రాష్ట్రస్థాయిలో పతకం సాధించిన అథ్లెట్‌ను మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం ప్రాంగణంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతిరావు ఘనంగా సత్కరించారు. అథ్లెటిక్స్ శిక్షకులు కాశీరావు, సీఐ నాగశేఖర్ పాల్గొన్నారు.

అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): క్యూబాపై అమెరికా విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు కోరారు. ఆలిండియా సీఐటీయూ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక గడియారం ఆసుపత్రి వద్ద మంగళవారం నిరసన తెలిపారు. అమెరికా సామ్రాజ్య వాదం నశించాలని.. క్యూబాపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యూబాపై అమెరికా ఆర్థిక, రాజకీయ ఆంక్షలు విధించడం అన్యాయమన్నారు. ప్రపంచ దేశాలన్నీ క్యూబాకు మద్దతుగా నిలవాలని కోరారు. నాయకులు రాజశేఖర్, రామకృష్ణ, రవి, మహ్మద్, బాలు, షేక్షావలి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఈశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసనకు దిగారు. ఆటో కార్మికుల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చిన్నచూపు వీడాలన్నారు. ఆటో కార్మికులకు శాపంగా మారిన జీఓలు 21, 31లను రద్దు చేయాలని కోరారు. ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు ఇవ్వాలని, సొంత గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్మికుల పిల్లలకు ఉచితంగా విద్యతోపాటు స్కాలర్‌షిప్పులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రాము, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిని కలిసిన కమిషనర్



జడ్జికి కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రిని మంగళవారం నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేసిన కమిషనర్ అనంతరం లోక్ అదాలత్‌లో ఉన్న నగరపాలక సంస్థకు సంబంధించిన కేసులపై చర్చించారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌పై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): బ్రెయిన్‌స్ట్రోక్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని న్యూరోఫిజీషియన్ డాక్టర్ నాగసురేష్ చెప్పారు. వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డేను పురస్కరించుకుని మంగళవారం స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన మొదటి గంటలోపు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తే ప్రాణాపాయంతో పాటు వైకల్యం నుంచి కాపాడవచ్చన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల స్ట్రోక్ నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు.

నేడు ధన్వంతరి జయంతి

కర్నూలు కల్చరల్: భగవాన్ ధన్వంతరి జయంతి వేడుకలు బుధవారం కర్నూలు నగర శివారు టీజీవీ నగర్‌లో ఉన్న ధన్వంతరి ఆశ్రమంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఏఆర్‌కే డేవిడ్, కె.బలరాముడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మానంద యోగి ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధన్వంతరి ప్రవచన పఠనం, అనంతరం ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఉంటుందని తెలిపారు. భక్తులు అందరూ పాల్గొనాలని కోరారు.

1న లోకాయుక్త సెలవు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని నవంబర్ 1వ తేదీన లోకాయుక్తకు సెలవు ప్రకటించినట్లు ఆ సంస్థ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయితే ఈ సెలవు దినానికి బదులుగా డిసెంబర్ 21 వ తేదీని పనిదినంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

మహోన్నతమైనది వైద్య విద్య



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి



అలరించిన విద్యార్థుల దేశభక్తి ప్రదర్శన



తెల్లకోటు ధరించి ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): వైద్య విద్య సుదీర్ఘ ప్రయాణమని, ఎంబీబీఎస్ నుంచి 13 ఏళ్లు కష్టపడితే గానీ పూర్తిస్థాయి ఫలితం దక్కదని రిటైర్డ్ ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి చెప్పారు. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీలో 'ఉద్భవ-2024' పేరుతో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ వైద్య విద్య ఎంతో ఉన్నతమైనదని, పేద ప్రజల ఆరోగ్యం, ప్రాణాలు కాపాడేది ప్రభుత్వ వైద్యశాలలేనన్నారు. వైద్య విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో అంకిత భావంతో మెలగాలని, అధ్యాపకుల మెంటార్షిప్‌లో ఉత్తమ వైద్యులుగా ఎదగాలని సూచించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. ఎంతో పట్టుదలతో మెడికల్ కాలేజీ సీటు సాధించి వచ్చారో అంతే పట్టుదల వైద్య విద్య పూర్తయ్యే వరకు చూపాలన్నారు. తోటి విద్యార్థులతో, సీనియర్ విద్యార్థులతో సుహృదాభావ బంధం కలిగి ఉండాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యమని, అధ్యాపకులతో, సీనియర్స్‌తో మంచి సంబంధాలు ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులచే హిపోక్రేటిక్ ఓథ్ చేయించి, తెల్లకోటు (యాప్రాన్)ను పంపిణీ చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకదేవి, డాక్టర్లు సాయిసుధీర్, హరిచరణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టెండరు గడువు పొడిగింపు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో పిలిచిన టెండర్ గడువును నవంబర్ 8వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలర్ డాప్లర్ 2-డి ఎకో కార్డియోగ్రఫీ మిషన్ కొనుగోలు కోసం పిలిచిన టెండర్ గడువు మంగళవారంతో ముగిసిందని, జాయింట్ కలెక్టర్, డీపీసీ ఆదేశాల మేరకు గడువు పొడించినట్లు పేర్కొన్నారు. వివరాలకు www.kurnoolmedicalcollege.ac.in, www.kurnool.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

హాకీ పోటీల్లో సత్తా చాటండి

కర్నూలు (టౌన్): నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నెల్లూరులో అండర్-17 విభాగంలో, అలాగే అండర్-14 విభాగంలో విశాఖపట్నంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ చాటాలని మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ దాసరి సుధీర్ సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రాష్ట్రస్థాయి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. అండర్ -17 విభాగంలో చరణ్, ధనుష్, షేక్ అల్ఫిషా, సఫియా, అండర్- 14 విభాగంలో మాలతి, మౌనిక, నాగరాజు, ప్రకాష్ ఎంపికయ్యారన్నారు.

అధిక ధరలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కె.శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): కూల్‌డ్రింక్స్, వాటర్‌బాటిళ్లను అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. ఓర్వకల్ ఎయిర్‌పోర్టు, ఓర్వకల్ మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిళ్లను ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్ముతున్నారని ఆరోపించారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కర్నూలు నగరంలోనూ అనేక చోట్ల కూలింగ్ పేరుతో బాటిల్‌పై రూ.5 ఎక్కువగా వసూలు చేస్తున్నారన్నారు. అయినా తూనికలు, కొలతల శాఖ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అధిక రేట్లకు విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. నగర అధ్యక్షుడు బాబయ్య, నాయకులు కాశీ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు సహకారం



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం తరపున ట్రాన్స్‌జెండర్లకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మంగళవారం ట్రాన్స్‌జెండర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్లలో అర్హులైన వారందరికీ పెన్షన్, ఆరోగ్యశ్రీ, ఆధార్‌కార్డులు మంజూరు చేయాలని, నైపుణ్యం ఉన్నవారికి సొంతంగా వ్యాపారాలు చేసుకోవడానికి బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. ఆసక్తి ఉన్న వారికి టైలరింగ్, ఎలక్ట్రిసిటీ, సాఫ్ట్‌స్కిల్స్‌లో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 660 మంది ట్రాన్స్‌జెండర్ల విద్యార్హత, వారు చేస్తున్న పని వివరాలకు సంబంధించి డేటా రిపోర్టు సిద్ధం చేయాలని, తద్వారా జాబ్‌మేళాలు నిర్వహించిన సమయంలో వారికి సమాచారం ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. ట్రాన్స్‌జెండర్ల హార్మోన్ల అసమతుల్యత, మానసిక సమస్యలపై వైద్య సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ.. టాన్స్‌జెండర్లను ఎవరైనా వేధించినా, దుర్భాషలాడినా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, ప్రభుత్వ వైద్యశాల సూరింటెండెంట్ డాక్టర్ ప్రభాకరరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా పాల్గొన్నారు.

పక్కాగా డీఎస్సీ స్క్రీనింగ్ టెస్ట్



మాట్లాడుతున్న జేడీ జే.రంగలక్ష్మిదేవి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఎస్‌సీ, ఎస్‌టీ అభ్యర్థుల ఉచిత మెగా డీఎస్సీ శిక్షణకు సంబంధించి నవంబర్ 3వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్‌ను పక్కాగా నిర్వహించేందుకు సహకరించాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జే.రంగలక్ష్మిదేవి కోరారు. మంగళవారం స్థానిక సంక్షేమ భవన్‌లోని డీడీ కార్యాలయంలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్న కళాశాలల ప్రిన్సిపాళ్లు, కంప్యూటర్ ల్యాబ్స్ టెక్నీషియన్లతో ఆమె సమావేశం నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ.. కోచింగ్ కోసం మొత్తం 795 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరికి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించేందుకు 800 కంప్యూటర్లు అవసరమవుతాయని, ఆయా కళాశాలల్లో వీటిని అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే ఇంటర్నెట్, పవర్ బ్యాకప్ కచ్చితంగా ఉండాలని, అభ్యర్థులకు అవసరమైన తాగునీరు, ఇతరత్రా వసతులు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కర్నూలు, పత్తికొండ, కోడుమూరు సహాయ సంక్షేమాధికారులు బీ.మద్దిలేటి, కే.బాబు, ఎస్.లీలావతి, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ పర్యవేక్షకులు సీమోన్ తదితరులు హాజరయ్యారు.

1న న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు (లీగల్): డోన్ న్యాయవాది, టీడీపీ మండల కన్వీనర్ ఎస్.శ్రీనివాసులుపై సీఐ ఇంతియాజ్ బాషా, సిబ్బంది దాడి చేసి కొట్టిన ఘటనకు నిరసనగా నవంబర్ 1న తమ విధులు బహిష్కరించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, రవికాంత్ ప్రసాద్, బార్ కౌన్సిల్ సభ్యుడు పి.రవిగువేరా తెలిపారు.

మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు

ఎలాంటి తప్పు లేకున్నా తమపై డోన్ సీఐ ఇంతియాజ్ బాషా ఈ నెల 13న దాడి చేసి కొట్టారని బాధితుడు ఎస్.శ్రీనివాసులు, ఆయన తమ్ముడు సత్యంరాజ్ మంగళవారం మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్‌ఐ నాగేంద్రకుమార్, కానిస్టేబుల్ చాంద్‌బాషా, హోంగార్డు అల్లీపీరా పోలీస్‌స్టేషన్‌లో తమను ప్లాస్టిక్ పైపులు, బూటు కాళ్లతో తన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుని, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు.

సూక్ష్మ సేద్యం కోసం సెల్ఫ్ రిజిస్ట్రేషన్

కర్నూలు (అగ్రికల్చర్): సూక్ష్మ సేద్యం కోసం రైతులు స్మార్ట్‌ఫోన్ ద్వారా సొంతంగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని ఏపీఎంఐపీ కల్పించింది. ఇప్పటివరకు బిందు, తుంపర్ల సేద్యం కోసం రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. దీన్ని మరింత సులభతరం చేస్తూ రైతులు తమ చేతిలోని స్మార్ట్ ఫోన్ ద్వారానే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. ఏపీఎంఐపీ యాప్‌ను రైతులు గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. ఇప్పటివరకు సూక్ష్మ సేద్యం కోసం 14,800 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి మినహాయించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న మున్సిపల్ డ్రైవర్లకు, లోడర్లకు ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్) నుంచి మినహాయించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు మునెప్ప విన్నవించారు. మంగళవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ డ్రైవర్లు, లోడర్ల విధులు ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. డివిజన్ పాయింట్ల వద్ద ఎఫ్ఆర్ఎస్ తీసుకొని విధులకు హాజరవుతారన్నారు. గార్గేయపురం డంపింగ్ యార్డులో అన్‌లోడ్ చేసి తిరిగి కర్నూలు నగరానికి చేరుకోవడంలో జాప్యం జరుగుతుందని వివరించారు. ట్రాఫిక్ సమస్య, వాహనాల రిపేర్ తదితర కారణాల వల్ల మూడు గంటల సమయం పడుతుందన్నారు. సమస్యను గుర్తించి ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయించాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మద్దిలేటి, చంద్రశేఖర్, జయరాం, మల్లికార్జున పాల్గొన్నారు.

బీఈడీ సెమిస్టర్ పరీక్షలకు 47 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షకు 47 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 17 కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలకు 568 మందికిగాను 521 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

31న షూటింగ్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 31వ తేదీ జిల్లాస్థాయి సీనియర్ బాలుర, బాలికల షూటింగ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు.

1న తెల్లారగానే పింఛన్ల పంపిణీ

కర్నూలు(సెంట్రల్): నవంబర్ 1వ తేదీన ఉదయం 6 గంటలకే పెన్షన్ల పంపిణీ ప్రారంభం కావాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో పెన్షన్ల పంపిణీపై సమీక్షించారు. గత మూడు నెలల నుంచి కర్నూలు జిల్లా పెన్షన్ల పంపిణీలో మొదటి స్థానంలో ఉందని, ఈసారి కూడా అదే మాదిరిగా పింఛన్లు పంపిణీ చేసేలా అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.

బాణాసంచా విక్రయ సముదాయం ప్రారంభం

కర్నూలు(సెంట్రల్): నగర ప్రజలు ఆనందంగా దీపావళి పండుగను జరుపుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ సూచించారు. మంగళవారం ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన క్రాకర్స్ షాపుల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. కర్నూలు నగరంలో 100 షాపులు ఏర్పాటు చేయడానికి అనుమతిచ్చినట్లు చెప్పారు. బీజేపీ నాయకులు సూర్యప్రకాష్, క్రాకర్స్ షాపు అసోసియేషన్ నాయకులు సందీప్, కృష్ణ, లవకుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి ఇంట్లో చోరీ

కర్నూలు (టౌన్): నాలుగవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయినాథ్ నగర్‌లో మంగళవారం చోరీ జరిగింది. ఆ ఇంట్లో నివసించే మధుసూదన్ ఆయన భార్య ఇరువురూ ఉపాధ్యాయులు. ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు ఇంట్లోకి చొరబడి రెండు తులాల బంగారు నగలను తీసుకుని ఉడాయించారు. సాయంత్రం ఇంటికి వచ్చిన ఉపాధ్యాయుడు ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాలనీలో రెండు రోజుల వ్యవధిలో మూడు చోరీ ఘటనలు జరగడంతో కాలనీవాసులు భయాందోళనలకు గురవుతున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే ధ్యేయం

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే విద్యుత్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రథమ కర్తవ్యం అని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. స్థానిక విద్యుత్ భవన్ కర్నూలులో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు, ఉద్యోగులతో కర్నూలు జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ ఉమాపతి ఆధ్వర్యంలో అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టెక్నికల్ పి.ఓబులేసు, కర్నూలు టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శేషాద్రి ఉద్యోగులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు పోటెత్తిన దిగుబడులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఉల్లిగడ్డలు, ఇతర ఉత్పత్తులతో మంగళవారం కిటకిటలాడింది. ఉల్లి క్రయవిక్రయాలు లేకపోయినా మార్కెట్‌లో భారీగా పేరుకుపోయింది. వేరుశనగ, ఆముదం, ప్రొద్దుతిరుగుడు, వాము, కందులు, కొర్రలు తదితర దిగుబడులు మార్కెట్‌కు భారీగా వచ్చాయి. అన్ని షెడ్లలో ఉల్లి నిల్వలు ఉండిపోవడంతో ఇతర ఉత్పత్తులను రోడ్లపైనే అమ్మకానికి పెట్టారు. వేరుశనగ 2071 క్వింటాళ్లు, ఆముదాలు 2375 క్వింటాళ్లు, కొర్రలు 323 క్వింటాళ్లు, ఎండుమిర్చి 101 క్వింటాళ్లు, మినుములు 101 క్వింటాళ్లు, సజ్జలు 120 క్వింటాళ్ల ప్రకారం వచ్చాయి. బుధవారం యార్డులో ఉల్లి క్రమవిక్రయాలు జరగనుండడంతో ఇతర పంటల విక్రయాలకు అవకాశం లేదు.

కొత్త రైతుబజారుకు రైతుల గుర్తింపు

- క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాత గుర్తింపు కార్డులు
- గ్రామాలకు వెళ్లి కూరగాయల సాగును పరిశీలిస్తున్న హార్టికల్చర్ కన్సల్టెంటు



కూరగాయల సాగుపై క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతున్న హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్

కర్నూలు(అగ్రికల్చర్): కల్లూరులోని గోవర్ధన్ నగర్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన రైతుబజారును త్వరలో ప్రారంభించనున్నారు. ఇందులో 34 మంది రైతులు తాము పండించిన కూరగాయలను అమ్ముకునేందుకు అవకాశం ఉంది. కూరగాయలు సాగు చేసే రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇప్పటి వరకు 18 దరఖాస్తులు వచ్చాయి. మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి ఆదేశాల మేరకు.. దరఖాస్తులపై హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ క్షేత్రస్థాయిలో విచారణకు శ్రీకారం చుట్టారు. కల్లూరు మండలం బస్తిపాడు, బొల్లవరం, కొంగనపాడు గ్రామాలకు చెందిన రైతుల భూములకు వెళ్లి పంటల సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల భూమి ఉంది.. ఏఏ కూరగాయలు సాగు చేస్తున్నారు. తదితర వివరాలు ఆరా తీస్తున్నారు. అర్హులకు గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతోందని హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. రైతుబజారులో నిజమైన రైతులకే అవకాశం ఇస్తామని పేర్కొన్నారు. అర్హులైన రైతులు కొత్త రైతుబజారులో కూరగాయలు అమ్ముకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ రైతుబజారును దీపావళి తర్వాత ప్రారంభించేందుకు మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది.

ముసాయిదా ఓటరు జాబితా సిద్ధం

- వచ్చే నెల 28వ తేదీ వరకు మార్పులకు అవకాశం



ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న కర్నూలు నియోజకవర్గ ఆర్‌ఓ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): కర్నూలు నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను నగరపాలక అధికారులు సిద్ధం చేశారు. ఈ జాబితాను ఎన్నికల రిటరి్నంగ్ అధికారి నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, తహసీల్దార్ వెంకటలక్ష్మీ, ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆర్‌ఓ చాంబర్‌లో ప్రదర్శించారు. కర్నూలు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,74,649 మంది ఉన్నారు, పురుషులు 1,32,848 మంది, మహిళలు 1,41,774 మంది, ఇతరులు 27 మంది ఉన్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ.. వచ్చే నెల 28వ తేదీ వరకు ముసాయిదా ఓటర్ల జాబితాలో మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. కొత్త ఓటుకు దరఖాస్తులు, జాబితాలో అభ్యంతరాలు, పేరు, చిరునామా వివరాల మార్పులు, పేర్ల తొలగింపునకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చిందన్నారు. ఈ సేవలను నగరపాలక సంస్థ కార్యాలయం, స్థానిక తహసీల్దార్ కార్యాలయం, బీఎల్‌ఓలను సంప్రదించి వినియోగించుకోవచ్చన్నారు. సూపరింటెండెంట్ సుబ్బన్న, సిబ్బంది పాల్గొన్నారు.

హరిత టపాసులతో పండుగ జరుపుకోవాలి



మాట్లాడుతున్న పీవీ కిశోర్ రెడ్డి

కర్నూలు(సెంట్రల్): పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతిఒక్కరూ హరిత టపాసులతో ఆహ్లాద దీపావళిని జరుపుకోవాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ (ఈఈ) పీవీ కిశోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఇందిరాగాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని చేయని టపాసులతో ఆనందంగా దీపావళి జరుపుకోవాలన్నారు. వాయు, శబ్ద కాలుష్య కారకాలపై ప్రజలందరూ చైతన్యవంతులు కావాలన్నారు. ఈ సందర్భంగా నారాయణ కళాజాతా బృందం 'క్రాకర్స్ వద్దు - దీపాలు ముద్దు' అంటూ పాటలు, మాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఈఈ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నాగ శివప్రసాదు పాల్గొన్నారు.

5న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



మాట్లాడుతున్న ఎస్ సబీహా పర్వీన్

కర్నూలు(అర్బన్): జాతీయ విద్యా దినోత్సవం/ మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవంబర్ 5వ తేదీన మూడు భాషలలో (తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ) వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్. సబీహాపర్వీన్ తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్థానిక గడియారం ఆసుపత్రి సమీపంలోని మైనార్టీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన 8 9, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు అదే రోజున ఉదయం 9 గంటలకు కళాశాల ప్రాంగణంలో పేర్లు నమోదు చేసుకొని పోటీల్లో పాల్గొనాలన్నారు. 'జాతీయ సమైక్యతకు, అభివృద్ధికి నమూనా అయిన భారతీయ మౌలానా జీవన శైలి' అనే అంశంపై ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో వేర్వేరుగా బహుమతులు, మెరిటోరియస్ సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందన్నారు. మరింత సమాచారం కోసం 9441761206ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో రాయలసీమ హజ్ సొసైటీ మెంబర్ మహ్మద్ పాషా, అల్‌మేవా నాయకులు అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు.

రక్తహీనతతో అనారోగ్య సమస్యలు

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనత కారణంగా మహిళల్లో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆరోగ్య విద్యా బోధకురాలు పద్మావతి చెప్పారు. మంగళవారం స్థానిక గడ్డ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తెలుగుగేరి సచివాలయం పరిధిలో తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తహీనత వల్ల అలసట, నీరసం వంటి ఆరోగ్య సమస్యలతో పాటు నెలసరి సమయంలో హెచ్చు తగ్గులు, గర్భం ధరించలేకపోవడం, గర్భం వచ్చినా నిలవకపోవడం, ప్రసూతి మరణాలు వంటి సమస్యలు వస్తాయన్నారు. దీన్ని అధిగమించాలంటే పోషకాహారం తీసుకోవాలని, వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని సూచించారు. సచివాలయ ఆరోగ్య కార్యకర్త నాగమ్మ, పొదుపు సంఘం ప్రెసిడెంట్ సునీత, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్‌లో అపార అవకాశాలు

కర్నూలు (సిటీ): స్థానిక బి.క్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ (సీజీటీ) ఒకేషనల్ గ్రూప్ విద్యార్థులచే దుస్తులు, హ్యాండ్ క్రాఫ్ట్ వస్తు ప్రదర్శన నిర్వహించారు. కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైనింగ్‌కు అపార అవకాశాలు ఉన్నాయని వివరించారు. జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వర రెడ్డి, ఇంటర్మీడియట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి మాట్లాడారు. వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల వెబ్‌సైట్‌ను ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రారంభించారు. లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.